

# వర్షంలో నర్తకి

గొల్లపూడి కృష్ణమూర్తి

రైలు కూత వేసింది.

జనంలో మళ్ళీ ఒక్కసారి సంచలనం కలిగింది.

"…. భయంగా ఉందికదూ?" లలిత నవ్వింది.

"కాదు! భారంగా." నాకు లలిత ముఖం చూడాలనిపించటంలేదు.

"ఒంటిని సుఖపెడితే అలాగే ఉంటుంది. కొత్త పేకువనే లేవండి. మరి ఆఫీసు టైము వరకి ముసుగు తన్ని, ఆ తర్వాత లేచి యిన్నాళ్ళలాగ భరత నాట్యం చేస్తానంటె. చూట్టానికని ఎవ్వరూ ఉండరు."

నా చూపు హడావిడిగా తిరిగి జనంలో చిక్కుకుపోయింది.

"….మొద్దునిద్ర పోతే పాలదికూడా లేపకుండానే వెళ్తుంది …. ఆ …. మరచిపొయ్యాను, పాలు పావుశేరే తీసుకోండి. మీరొక్కరే కదూ …. సరిపోతాయి …"

దానికి నా సమాధానం అవసరము లేదు.

"….పేకాటగాళ్ళని. పగటి వేషగాళ్ళని తీసుకొచ్చి కూర్చుండబెడతానంటే పదిశేర్లయినా తక్కువే మరి. కడుపు కొలతని చూసుకు మరీ వండుకోండి, అసలే బియ్యం ధర మండిపోతోంది. వంట



చేతగాక హోటలు పకాం చేస్తే నేనూ రొక్కాను.... మీరేం చేసినా యిక్కడున్నట్టే పట్టెయ్యగల్ను.... వింటున్నారా?"

"చిత్తం. అసలు నన్నో మగాడి క్రింద జమకడుతున్నావా?... లేక...."

"— అనేకద చెప్పటం అయినా పెళ్ళాన్ని ఆ మాటడిగక్కరలేదు." ముసిముసిగా నవ్వుతూ అంది.

బండి కదిలితేనేగాని దండకం ఆగేట్టు లేదు. యిల్లు కదిలి రిక్షా ఎక్కిందమొదలు చెప్పిన సంగతే చెప్తూ పసపిట్టలాగ అరుస్తూంది.

బాబు లలితఒడిలో నిద్రపోతున్నాడు. స్టేషనంతా గందరగోళంగా ఉరుకులు పరుగులతో నిండిఉంది. యింజను చెవికోసిన కుక్కలాగ గూబ పగిలేట్టు అరుస్తుంది.

"వీడిట్లా నిద్రపోతున్నాడేమిటి."

"అంతా మీ పోలికే మరి." లలిత నవ్వుతుంది. నాకు కోపమొస్తూంది.

నా చూపు జనంలోంచి దారి చూసుకుని లలిత ముఖం మీదకి వచ్చి ఆగింది.

"నీకు సమయము, సందర్భము తెలియదు."

"తిరిగొచ్చినాక నేర్చుకుంటాను గాని, నేను చెప్పింది మరిచేరు."

"అంతా నువ్వే చెప్తావా? కాస్త నా సంగతేమైనా వింటావా?"

ఉడుకుమోత్తనంగా అనేశాను.

"త్వరగా రమ్మని .... అంతేకదూ?" అంది నా కళ్ళలోకి చిలిపిగా చూస్తూ.

గార్డు విజిల్ ఊదాడు.

"జాగ్రత్త"

"ఇంకా ఏమిటి?"

"మీ బుద్ధి"

కిటికీ ముందుకు జరిగింది. నేను నిలబడిపోయాను. లలిత చేతి రుమాలు ఊపటంలేదు. బండి స్టేషను దాటింది. నేను స్టేషను బయటకొచ్చాను. సన్నగా చినుకులు. ఈదరగాలి ప్రారంభమయింది. రోడ్డుమీద జనం పరుగెత్త నేర్చుకుంటున్నారులాగుంది.

"శంకరం .... ఒరే శంకరం" కీచురు గొంతుతో అస్తవ్యస్తంగా వినబడింది పిలుపు. వెనక్కి తిరిగాను. సుబ్రహ్మణ్యం రిక్షాదిగి ఎదురుగా వస్తున్నాడు. వాడు మా ఆఫీసులోనే గుమస్తా మనిషి - కుదేసినట్టు పొట్టిగా, గుండ్రంగా ఉంటాడు.

"ఏటు?"

"బండి వెళ్ళిపోయిందా?" వాడి తిరుగు ప్రశ్న.

"ఆ .... లక్షణంగా .... లలితనుకూడా తీసికెళ్ళింది. ప్రయాణమా?"

"అనుకునే బయలుదేరాను." సంచిని ఎడంచేతికి మార్చి తిరుగుముఖం పడుతూ అన్నాడు.

"పోయింది ఎలాగూ పోయింది. సినిమా కెళ్దాం పద. టైం పాసవుతుంది" వాడే. హోటల్లో టీ త్రాగి. మూడురూపాయలిచ్చి. మూడు గంటలు సినిమా హాల్లో గడిపి బయటపడ్డాము.

నాకు నవ్వొస్తుంది. గంటసేపు ఏకరువు పెట్టిన లలిత నీతి పాటను అరగంటలో గంగలో కలిపాను.

"ఎందుకు నవ్వటం?"

"మనిషి మతిమరుపుకి."

రోడ్డంతా బురదగా ఉంది. సుబ్రహ్మణ్యాన్ని వదిలి ఇంటికి చేరాను.

పచ్చడిముద. జాడీలో పెరుగు మిగిల్చిపోయింది లలిత నా భాగ్యానికి.

"ఇక సాగర మధనం ఆరంభం."

"భోజనం అయిందనిపించాను బ్యాలెన్స్డ్ డైట్ నే భోజనమంటారో? లేక అడ్డమయిన గడ్డికూడనో? నాకు తెలియదు గాని, ఉన్న నాలుగు ముద్దలు కడుపులో పడేశాను.

ప్రక్క సర్దుకుంటె సుబ్రహ్మణ్యం మళ్ళీ వచ్చాడు సంచి పుచ్చుకుని.

"ఏమిటి సంగతి? ఆ సంచిని వదిలేట్టు లేవు." అలాగే నిలబడ్డాడు.

"మూడు గంటలకిమళ్ళీ బండిఉందట"

ప్రశ్నతో కూడిన సంశయాత్మక సమాధానం.

"అయితే?"

"ఏమీలేదూ.... కన్ను మూతబడితే... నీకు తెలుసుగా నా సంగతి... పుణ్యముంటుందిగాని, రెండున్నరకి లేపుదూ."

"బాగుంది, నీకో సామెత చెప్పనా?"

"వాల్లేవోయ్...." కాసేపాగి "పోనీ ఆటలు వేసుకుందామా?" అన్నాడు.

"హాతోస్మి"

వాడి ఉద్దేశం – మూడు గంటలవరకు జాగారం చెయ్యాలని.

పేకముక్కలు ముందేసుకున్నాము. రెండాటలు వేసేసరికి నిద్ర ముంచుకొచ్చింది. సుబ్రహ్మణ్యాన్ని సముదాయించి కాయాల్ని మంచాలమీదికి చేర్చాము.

అందరు మూడోతరగతి వాళ్ళకిలాగానే నాక్కూడా పడుకోగానే దోమలు, దోమల్లాంటి ఆలోచనలు చుట్టుకున్నాయి. వాటి మధ్య తియ్యగా పెళ్ళాం విషయం, చేదుగా అప్పులాళ్ళు. గొర్రె తోకంత జీతం. చాంతాడంత కోరికలు. వీటి మధ్య ఆకాశం ఎత్తు ధరలు, వాచిపొయ్యే మొహాలు, స్వంత వ్యాపారమైనట్టు బిగుసుకుపొయ్యే ఆఫీసరు, చెప్పులు గిల్లుకునే గుమస్తాలు. పనికి రాని రాజకీయాలు పక్కింటి మొగుడు పెళ్ళాల కథ - అన్నీ మెదడ్లో బిలబిలలాడాయి. ఉదయం ఏడు గంటలకు నిద్ర లేచే సరికి. సుబ్రహ్మణ్యం శుభ్రంగా ముసుగు తన్ని గురక పెడుతున్నాడు.

"హార్నీ దుంప దెంచ, వీడింకా యిక్కడే చచ్చాడేమిటి!.........నాయనా! సుబ్రహ్మణ్యస్వామి, స్టేషనొచ్చింది. దిగు. దిగు."

చెవి దగ్గర కేక వేశాను. నాకు నవ్వాగటంలేదు.

గబగబా దుప్పటి తీసి తలవేపున్న సంచి చేత పుచ్చుకున్నాడు, నిద్రమొహంతో.

"బండి దిగుదామంటావా? యింకో స్టేషను పోనిద్దామా?"

కళ్ళు విడిలించి చుట్టూరా చూసి, నీళ్ళుగారి పొయ్యాడు. యిప్పుడర్థమైనట్టుంది మహానుభావుడికి.

"లేపొద్దట్రా వెధవ మొహమా!"

వాడి కళ్ళు ఎర్రగా ఉబ్బి వున్నాయి. పాపం కోపంకూడా వచ్చినట్టుంది.

"ఇంతకీ రాత్రి అలారం కీ యిచ్చావా?" అన్నాను దోషం నాది కాదన్నట్టు.

"నిన్నని ఏం లాభంలే .... యివ్వాల్టి నుండి ఈ యింటికి కాలదోషం పట్టింది."

"ఊ ...గతజలసేతుబంధనం. ముఖం కడుక్కో, కాఫీ తాగుదువుగాని" వినుక్కుంటూనే మొహంమీద నీళ్ళు జల్లుకుని కాఫీ త్రాగాడు.

"మరి ఏమిటి కర్తవ్యం?"

"నాయనా! నన్ను చంపక, వెళ్ళి ఏదైనా బస్సులో తగలడు... యింతకూ ఎక్కడికి ప్రయాణం?"

"నా భార్యామణిని తోలుకురావలెన్." అప్పుడప్పుడు ఆవిడని నాలుగు కాళ్ళ జంతువుతో పోలుస్తాడు (మన)వాడు.

"ఒక్కర్తీ రాదేమిటి?.... బండి ప్రయాణమే కదూ!"

"నీలాంటి అదృష్టం అందరికీ ఉంటుందనుకోకురా.... ఖర్మ.... యిదంతా పూర్వజన్మ సుకృతం.' ఏదే దునా. అన్నట్టుంది వాడిస్థితి.

"ఊరుక్కుంటే పోలే?" నా సలహా.

"పోతుంది. వంట యింట్లో రోజూ నా ప్రాణం పోతోంది. ఏ ఫైలు ఏ మూల ఉందో చూడకుండా చెప్పగల్నుగాని. ఈ వెచ్చం డబ్బాలున్నాయి చూశావూ? చూసిన దాన్నే తిరిగి తిరిగి చూడ్డంతో తల బద్దలవుతుంది. ఈ పాటికి అన్నమైనా మెత్తబడుతుంది, కూరైనా మాడిబొగ్గవుతుంది. ఒక్క వంటకం మనుషులు తినేట్టుగా తయారవుతే అంత ఒట్టు. యిక హోటళ్ళో వాడు పెట్టేది అన్నం కాదు, గడ్డి. అయినా నేను చెప్పటమెందుకు. యివ్వాల్టి నుండి

మన పని కూడా శ్రీమద్రమారమణ ....."

సుబ్రహ్మణ్యం భార్య నా భార్య లాంటిది కాదు. గంగిగోవు.... ధర్మపత్ని ....

ఈ మహనీయుడే అప్పుడప్పుడు ఏడుస్తుంటాడు

—"దానికి చదువు రాద"ని "కట్నం తీసుకు రాలే"దనీను. ఆ మాటకొస్తే నా భార్య కట్నం తెచ్చిందని కాదు. ఏదో యింత చదువూ, సంసారాన్ని చక్కబెట్టుకునే తెలివుందని చేసుకున్నాను గాని, నా బ్రతుకుని యిలా అల్లం ముక్కలా కాల్చుకు తింటుందని తెలిస్తే ...

"నే వెళ్తున్నా"నంటూ సుబ్రహ్మణ్యం సంచి చేతపుచ్చుకున్నాడు. వాడ్ని సాగనంపి, మధ్యలో మార్కెట్టును దర్శనం చేసుకుని, యింటికి చేరేసరికి తొమ్మిది దాటింది. వంటయింటి ప్రవేశం గావించి స్టౌ అంటించినాక అర్థమయింది. గిన్నెలు తోమిపెట్టినవి లేవని. స్టౌ ఆర్పి చెంకాయ పీచుపెట్టి కాసేపు వాటిమీద కసరత్తు చేశాను. లలిత అప్పుడప్పుడు పిసినారి వేషం వేస్తుంది. పనిమనిషిని మాన్పించినందుకు అప్పుడు కోపం కూడా వచ్చింది.

బియ్యం కడిగి స్టవ్ అంటించి, టమాట ముక్కలు కోసి పెట్టుకున్నాను.

"భరతనాట్యం.... చూట్టానికని...." లలిత మాటలు జ్ఞాపకమొచ్చాయి. టమాట ముక్కలు పోపువేసి, మాడిపోతుందని గ్లాసుడు నీళ్లు కూడా గుమ్మరించాను." కూర బొగ్గవడమో" అన్న సుబ్రహ్మణ్యం మాటలు కూడా కించిత్ మనో ఆకాశంలో మెదిలినాక.

పకపకమని నవ్వు వినిపించి వెనక్కు తిరిగి చూశాను. నీల!

రాజరాజుకి కోపం వచ్చిందంటే! రాదూ మరి? —

— సమయమూ అదీ లేకుండా.

"ఎందుకు నవ్వటం? మీ ఆడవాళ్ళకి నవ్వటం, ఏడ్వటం తప్పితే యింకోటి చేతకాదు" అన్నాను కోపంగా.

"మీకుమాత్రం కోపం చేతనవు ......
అయినా పట్టి టమాటకూరేకదా! నీళ్ళెందుకు పోయటము? వాట్లో కావల్సినంత నీరుంటుంది."

"ఆహాఁ ...ఈ దేవ రహస్యం మాకేం తెలుసు."

"మరి?"

"మరి... మరి...." ఆ తర్వాత మాటలు నాకు దొరకలేదు.

"నీలా! నీకు పుణ్యముంటుందిగాని దీన్ని కూరగా, ఆ బియ్యాన్ని అన్నంగా మార్చి పారేద్దువూ. నీపేరు చెప్పుకుని...."

"ఆ .. ఆ ..ఆపండి పొగడ్తలు."

"సరే మరి నేను స్నానం చెయ్యనా? ఆఫీసుకి టైమవుతుంది." నీల పొరుగింటి అవివాహిత అయిన యువతి. ఆమె అంత అందగత్తె కాదు గాని, పెళ్ళికాని వాళ్ళకి, పెళ్లాం చెంతలేని వాళ్ళకి అపూర్వమైన అప్సరసలాగే అగుపడుతుంది. లలితకు, ఆ పిల్లకు చాలా దగ్గరి స్నేహం. లలితను అక్కయ్య అంటూ, నన్ను బావగా మార్చేసుకుని మాకు సాయం చేస్తూ, మధ్య మధ్య తనూ పొందుతూంటుంది. లలితకు వచ్చే కుట్లు, అల్లికలు, ముగ్గులు వంట, ఒక్కటేమిటి, గృహిణి అయిన, అవబోతున్న ప్రతి స్త్రీకి ఉండాల్సిన సర్వలక్షణాలను బోధించి, తత్ ప్రతిఫలంగా బియ్యం, పప్పులు. వెచ్చాలు, మొదలైన వాటిలోని, షాహుకారు మహానీయులు నామమాత్రమే అనుకుని కలిపిన దుబ్బ చెత్త చెదారాన్ని ఏరటానికని సహాయంగా పిల్చుకుంటుంది.

* * *

ఉదయము నాలుగు గంటల వేళకి తలుపు తట్టిన శబ్దం వినబడితే వెళ్ళి తీశాను. లలిత వచ్చింది.

ఇక ఈ జన్మకు సుఖనిద్రకు దూరమైనట్టే. (నా దృష్టిలో—రాత్రి పన్నెండుకి పక్క చేరినాసరే, ఉదయం పదింటిదాకా పడుకోవటమే సుఖం) ఈ గుమస్తా ఉద్యో

గనులకి ఏరకంగా సుఖమనేది లేదుకనుక, కనీసం నిద్రసుఖంకోసం పదకొండు గంటలకు పెట్టారు ఆఫీసు టైము. అఫ్‌కోర్స్ వస్తున్నారే అనుకొంది: కాని ఒక్కొక్కరే చుక్కలు తెగి పడ్డట్టు తమతమ సీట్లను దులుపుకుని. ఫైళ్ళలో తల దూర్చేసరికి తప్పకుండా పదకొండు కొట్టి చూపిస్తుంది గడియారం. కొండొకచో మరో 30 నిమిషాలు కలుపుకోవచ్చు కూడా.

"ఏమిటీ వేళ గాని వేళ?"

"బండి లేటయింది" ముభావంగానే పిల్లవాడ్ని మంచంలో వేసి, ముఖం కడుక్కొని వచ్చి మంచినీళ్ళు తాగి పండుకుంది. నేను ప్రేక్షకునిలా మాత్రమే నిలబడ్డాను.

"ఉత్తరం వెయ్యగూడదూ?"

"నాకు నిద్రొస్తోంది .... యిప్పుడు మీ యక్షప్రశ్నలకు సమాధానం చెప్తూ కూర్చోలేను." కనీసం మొహమైనా చూడకుండా అటు తిరిగి పడుకుంది.

"కాఫీ పెట్టేదా?" పాలులేవని నాకు తెలుసు. ఈ నాలుగ్గంటలకి ఉండవు కూడా.... లలిత మాట్లాడలేదు.

తలుపులు మూసివచ్చి నేనూ పడుకున్నాను....

ఉదయం తెలివి వచ్చేసరికి వంటింట్లోంచి లలిత అరపులు వినబడుతున్నాయి. బహుశః చెల్లాచెదురైన గొర్రెల మందలా అగుపడుతున్నాయి కాబోలు వంటసామాన్లు వాటినో కొలిక్కి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్టుంది.

"... రామ! రామ! యిది యిల్లేనా? మనుషులున్న కొంప యిలాగేనా ఉండేది? ఒక్కడబ్బామీద మూత తగలడిలేదేం....? అయ్యో! పంచదారకన్నీ చీమలు చుట్టుకున్నాయి. నూనెలో బొద్దింక చచ్చి కాలబడిందేమిటీ? ఛీ....ఛీ....వంటింట్లో ఈ పాడు సిగరెట్లేమిటీ? ఒక్కసారి యిన్ని కూరగాయలు తెచ్చి కాలబెట్టుకోవటం దేనికీ? మురిగి వాసనపడ్డాయి.... "యింకా యింకా సాగుతూనే ఉంది కవనం. నెలరోజులయింది లలిత తీయని కంఠం విని బతక. ఆ అరుపులు నా ప్రాణానికి హాయిగా, జోలపాటలా సోకుతున్నాయి. కిటికీలోంచి గాలి చల్లగా వీస్తూంది. లేచి


## కాయకల్ప చికిత్స

హృదయముపూపిరితిత్తులు, పైత్యకోసము పూర్తిగాశిధిలము కాకుంటే ఈ చికిత్స పొందవచ్చును. 3లేక4 మాసములలో ఈ చికిత్సవల్ల దేహములోనున్న అన్ని వ్యాధులు నివారణమగుటయేగాక సగము వయస్సు కలిసివచ్చును. అనగా 60 సంవత్సరములవారు ఈ చికిత్స పొందిన 30 సంవత్సరముల ప్రాయములో వారికి వున్న యవ్వనము కలుగును. ఇంగ్లీషు అయుర్వేద యునాని హోమియోపతి ప్రకృతి వైద్యం వల్ల సాధ్యము కాని అన్ని వ్యాధులు నివారణమగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రెండు రూపాయలు పంపవలయును.

★

శ్రీ యోగాశ్రమము

పెదవాల్తేరు.

విశాఖపట్టణము—3

వెళ్ళి బాబు ప్రక్కన పడుకుని వాడ్ని బిగ్గరగా కౌగిలించుకుని కళ్లు మూసుకున్నాను.

లలిత అరుపులు, గోడలమీది దుమ్ము దులుపుతున్న చీపురు చప్పుడు వినిపిస్తూనే ఉంది. నా మనోయవనిక మీద పేరుకున్న మలినాల్ని కూడా ఏదో అజ్ఞాత హస్తం తీసి దూరంగా విసరి, చీపురుతో దులుపుతున్నట్టు ఫీలయ్యాను.

గుమ్మంలో అడుగులచప్పుడు విని కొంచెం ముసుగు తొలగించి చూశాను. నీల.

గుండె ఒక్కక్షణం ఆగి మళ్ళీ గబగబా కొట్టుకోవటం ఆరంభించింది. నేరుగా లోపలికెళ్ళి లలితతో మాట్లాడుతుంది. నా మనస్సు క్షణంలో పదిహేనురోజులు వెనక్కి పరుగెత్తింది.

కిటికీ ఎదురుగా కుర్చీ వేసుకుని కూర్చున్నాను. యింటి వెనుక గోడపై కూర్చుని నీల పందిరి మీద మల్లెపూలు కోస్తోంది. వర్షం వచ్చేలాగుంది. ఆకాశంలో మబ్బులు గుమిగూడుతున్నాయి. చల్లటి గాలి ముఖానికి అలలు అలలుగా తాకుతుంది. ఏదో తెలుగు సినిమా పాట తాలూకా రాగం సన్నగా ఆలాపిస్తూ పూలలో ఒడి నింపుకుంటుంది నీల. గోడమీంచి పూర్తిగా పందిరి మీదికి వంగి పూలు కోస్తుంటె భుజం మీది పైట జారిపోయింది.

సన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి. తడిగుడ్డను ఝాడించినట్టు చల్లటి తుంపర్లు ముఖానికి కొడుతుంటె వెచ్చటి ఊహలు మెదులుతున్నాయి. సిగరెట్ అంటించుకుని అలాగే కూర్చున్నాను. చినుకుల్లో మబ్బుపనకల్లా తేలిపోయింది పొగ.

"ఏమిటి విశేషం? మరీ అన్ని పువ్వులు .... పూలపాన్పేమయినా...."

"ఊఁ ...అంత కోరికగా వుందేం?"

"మరేఁ."

చూస్తుండగానే వాన ఉధృతమై నీల గోడమీంచి దిగేలోపల తడిసి ముద్దైంది.

ఎలాగూ మా యింట్లోంచే పోవాలి గనుక, ఆ పోవటమనేది నా ఎదురుగుండానే కనుక – వలవేసి కూర్చున్నాను ఒంటికి అంటుకుపోయిన చీరతో ఒంటరిగా "స్త్రీ" లా అగుపడింది నీల, గదిలో. తడిసిన కనురెప్పల్ని పక్షిరెక్కల్లా తపతపలాడించి మత్తుగా, బరువుగా నవ్వింది. ఆమె శరీరంలోని ఎత్తొంపులుగా ఉండాల్సిన ప్రదేశాలన్నీ దాపరికం లేకుండా స్పష్టంగా అగుపడుతున్నాయి. తడిసిన తెల్లవాయిల్ చీరలోంచి ఆమె చామనఛాయ ఒళ్ళు పొగమంచులోంచి వినీలాకాశంలా స్పష్టాస్పష్టంగా గోచరిస్తోంది. నాలో పిచ్చి ఊహలు సుళ్లు తిరుగుతున్నాయి. రక్తంలో వెచ్చదనం పరుగులు తీస్తుంది.

"యిప్పుడు తలుపులు బిగిస్తే ఏం చేస్తావు?"

"బావగారు! అది మీవల్లకాదు" అంది ఛాలెంజి చేసినట్టు. నాలో శివం పూనుకుంటోంది. అమాంతం నీల చెయ్యి పుచ్చుకున్నాను. క్షణకాలం నివ్వెరపోయి ఫక్కున నవ్వింది.

నాలో సంబరం, ఆవేశం ఉరకలు వేసింది. నా చేతులు ఆమె నడుం చుట్టూ కొండ చిలువలా చుట్టుకున్నాయి.

"ఏమిటిది?"

"ఎవరికీ తెలియదులే." ఎక్కువ మాట్లాడి సమయం వ్యర్థం చేయాలనిపించటంలేదు నాకు.

సాలెగూడు-కీటకంలా కొంత వ్యవధి పెనుగులాట తర్వాత నా చేతులు ఝాడించి దూరంగా జరుగుతూ అంది.

"తప్పు. పదిమందికి తెలిస్తేనే భయపడాల్సిన అవసరంలేదు."

"ప్చ్ ... తప్పేం లేదులే నీలా" నేనేం మాట్లాడుతున్నానో తెలియటంలేదు.

"తెలివితక్కువగా మాట్లాడకు బావా!

ఈ పనే తప్పు కాని ఆక్షణంలో అసలు లోపంలా అనిపించలేదు. మనసుని మభ్య పెట్టుకుని, మానవత్వాన్ని చంపుకున్న పాపానికీ ఏమనీ తప్పనిపించదు .... నీకంటికి వేశ్యలా అనుపిస్తానా బావా? అక్కయ్యను నువ్వెంత పవిత్రురాలిగా ఉండాలని కోరు తావో, నా భర్తా నన్ను అలాగే ఆశిస్తాడు. అయినా ఈ కోరిక కలిగినందుకు దోషం నీది కాదు. అక్కయ్య లేని లోటు. అంత మాత్రాన చెల్లెలిలాంటి దాన్ని పక్కమీదికి పిలుస్తావా? నన్ను చూడ్డానికని యివ్వాళ మా యింటికి బంధువులు వస్తున్నారు. నన్ను ఆశీర్వదిస్తావని, నా ఒడిని పూలతో నింపుతావని .." నేలమీద చెల్లాచెదరైన మల్లెపూవుల్ని చూస్తూ అంది ఆర్ద్రంగా.

ఆక్షణంలో రంగులుమారే నాముఖాన్ని ఆమె గుర్తించకుండా ఏ మరుగుతున్న తావులోనో, చీకటి గుహలోనో దాచుకో వాలనిపించింది.

నీల వెళ్ళిపోతూ వెనక్కి తిరిగింది.

నాలోని సర్వశక్తుల్నీ కూడగట్టి ఆమె చెయ్యందుకున్నాను.

నిర్వికారంగా నాకు చేరువగా జరిగింది. ఆమె భుజంమీదుగా చెయ్యిచుట్టి బుగ్గలమీంచి జారే కన్నీటిబొట్లను తుడిచివేస్తూ "నీలా నేనీ పని ఎలా చేశానో నాకర్థం కావడం లేదు. నాలో ఏదో పైశాచికశక్తి ప్రవేశించింది. నన్ను క్షమించమని అడుగ లేను ...ఇక్కడ జరిగింది ఇప్పుడే మరిచిపో. మళ్ళీ మామూలు నీలగా, మామూలు శంకరం. లాగానే నడుచుకుందాం" అంటూ నేలమీది పువ్వుల్ని దోసిలితో ఎత్తిపట్టి ఆమె ఒడిలో పోశాను.

నీల మందంగా అడుగులు వేస్తూగుమ్మం దాటి చినుకుల తెరల్ని చీల్చుకుంటూ ముందుకు సాగిపోయింది.

* * *

"నువ్వెళ్లాక బావగారేం చేశారో తెలుసా?"

"ఏం చేశారు?"

"ఓనాడు ...."

"ఊఁ."

"ఓనాడు వర్షంలో తడిసిపోయి ...."

"ఊఁ తడిసిపోయి?"

"త... డి... సి... పో... యి ...."

నా శ్వాస ఆగిపోయింది. ప్రాణం నీళ్ళల్లో కొట్టుకు లాడుతుంది. చేతులు గుండెలకు దగ్గరగా యింకా దగ్గరగా పక్షవాతం రోగికిలా జరుగుతున్నాయి.

కెవ్వుమని అరుపు విని ఎగిరిపడి వెనక్కి జరిగాను.

వాళ్ళిద్దరు మాటలు ఆపి మంచం దగ్గరికి పరుగెత్తి వచ్చారు. బాబు గొంతు పెంచాడు. లలిత తిట్లు వినపడకుండా దుప్పటి చెవులనిండా కప్పుకున్నాను.

"ఏడయింది, సుప్రభాతం పాడాలేవిటి?"

"యివ్వాళ ఆదివారం." ముసుగులోంచే జవాబిచ్చాను.

"ఉహుఁ ....ఎలా ఆ నీళ్ళటు పట్టా."

లేచి కూర్చున్నాను. బాబు నీల చేతుల్లో ఆడుకుంటున్నాడు.


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
Bensons-2141.TEL

"పట్టా నీలా... యికనుండి నీవు నేర్వవలసింది అంతా ప్రాక్టికల్‌గానే...."

"అవును, లలితా నీకో శుభవార్త, నీలా పెళ్ళి నిశ్చయించామోయ్."

"అబ్బ మహాకబురు చెప్పొచ్చారులెండి ఆ వచ్చిన వాడెవడో కాదు. మా మేనత్త కొడుకే.... నేనూరెళ్ళింది ఎందుకో కాదు,"

నీల ముఖం సిగ్గుతో నేలకు వేలాడింది. బాబుని ముద్దుల్తో ముంచి గభాల్న బయటికి దూసుకుపోయింది. నా మనసు దూది పింజలా తేలికపడింది.

పగలు ప్రక్కకు జరిగి రాత్రికి చోటిచ్చింది.

రేడియో కట్టేసి మంచంమీద కూర్చున్నాను. లలిత బాబుని భుజంమీద వేసుకుని అటు యిటు తిరుగుతూ జోకొడుతుంది. కిటికీలోంచి బయటికి చూస్తూ "ఎంతవరకొచ్చింది మీ వర్షంలో కవిత" అంది.

"తడిసింది. యిక ఉతికి ఆరెయ్యడమే తరువాయి."

లలిత నవ్వింది. "పొయ్యిలో వేసి వెచ్చబెట్టానులెండి,"

"ఆఁ."

అదేపనిగా నవ్వుతోంది.

"ఏదైనా సర్టిఫికేట్ పంపిద్దామనుకున్నాను. మీ ఆడవాళ్ళకి హృదయముండదు."

"పాపం! దేవుడు మాకేం నాలుగైదు యివ్వడు మీకులాగ... అయినా నాకు తెలియక అడుగుతాను, మీ పైత్యాన్ని చదివే పిచ్చిలేవని మనుషులు యింకా ఉన్నారంటాం లోకంలో?"

బాబుని భుజంమీంచి దింపి మంచంలో వేసి, కుర్చీలో కూర్చుని ఉత్తరం రాసుకుంటోంది. వాడు నిద్రపోతున్న వాడల్లా రాగాలాపన మొదలెట్టాడు. యింటి వెనుక మల్లె పందిరి మీంచే మెత్తని వాసన అమాంతం గదిలోకి చొచ్చుకొస్తోంది. అటు యిటు దొర్లిలేచి కూర్చున్నాను.

"నాకు నిద్ర రావటంలేదు."

"నాకు తెలుసు ఎందుకురావటంలేదో"

"తెలిసుండి చంపట మెందుకు?" నా గొంతులో నిరీక్షణలోని అలసట ధ్వనించింది.

లలిత మాట్లాడలేదు. తలెత్తకుండా రాస్తోంది. వాడేమో వాల్వులు చెడిపోయిన రేడియోలాగ కీచురుమంటు ఏడుస్తూనే ఉన్నాడు.

"లైటార్పుతాను."

"నేను రాసుకోవాలి."

"అబ్బ! వాడ్ని ఊరుకోమనదూ..."
చెవులు చిల్లులు పడుతున్నాయి."

"అయిపో వస్తుంది. కాసేపు మీ రే ప్రయత్నించండి... అర్ధనారీశ్వరులుగదూ"

రోషంతో ముసుగేసుకుని పడుకున్నాను ఊహూ... లలిత యిప్పట్లో లేచేట్టు లేదు. కాసేపు వాడ్ని సముదాయించి చూశాను. ఆగలేక రెండంటించాను కూడా.

"లలితా నీకు పుణ్యముంటుంది గాని కాస్తలేద్దూ." చేతిలోని కలం లాక్కుని, లెటర్లు డ్రాయర్లోకి తోసేశాను.

"మీ చేతగానితనానికి వాడ్ని కొట్టటం దేనికి?"


దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యం



వరిబీజము (బుడ్డ) లకు. అచ్చటి నరములబలహీనతచే అంగము చిన్నదై అవసరకాలంలో అసంతృప్తి, మూత్రవ్యాధులు, ఆపరేషన్ లేకుండా నమ్మకంగా చేయబడును. స్వయముగారండి

శ్రీ బాలాజీ వైద్యశాల, డా॥ దేవర

టి. బి. రోడ్, ఫోన్: 551. తెనాలి.

బ్రాంచి: 9-డి, శివాజీస్ట్రీట్, మద్రాస్-17.

SUVARNA

... ఎంత విసిగిస్తాడేం? అయినా వీడికింకా పడుకునే వేళకాలా?

"మీరు మాత్రం?" లేచి వెళ్ళి వాడి ప్రక్కన పడుకుని పాలుపట్టిస్తూ అంది.

"వెధవ ఏడుపు మొహం వీడూనూ, పానకంలో పుడకలాగ." బాబుకి రెండో వేపుపడుకుని లలిత నేయి పుచ్చుకున్నాను.

"ఏమిటా తొందర," లలిత కసరుకొంది.

"ఇంక నన్నెప్పుడు అర్థం చేసుకుంటావు?"

లలిత నవ్వింది. "పదహారు వందల ఏళ్ళక్రింపటి ఇక్ష్వాకుల కాలంనాటి భాషే అర్థం చేసుకుంటున్నారు మనుషులు. మీరు అర్థం కాకపోవడం ఏమిటి.. ఊ .. బాబును పడుకోనివ్వండి." కోరగా చూస్తు అంది.

"హమ్మయ్య" అ మాట నా ప్రాణానికి నెమ్మది కూర్చింది.

లలిత కళ్ళలోకి చూస్తూ పడుకున్నాడు. ఆమె బాబు ముఖంలోకి చూస్తూంది. వాడు పెదవులు ఆడిస్తు కళ్లు మూసుకునే పాలు గుంజేస్తున్నాడు.

"నెల్లాళ్ళుండి నేనెంత నిద్రకు కరువయ్యానో తెలుసా?" కాసేపు నిశ్శబ్దం.

"మరి నేనూ అంతే" లలిత ఫక్కున నవ్వింది.

"నిజంగా!" నడుంమీద చేయి వేసి, దగ్గరగా లాక్కుంటూ అన్నాను.

"ఉష్ .... అల్లరిచేస్తే వాడు మళ్ళీ లేస్తాడు."

మల్లెపూల వాసన మత్తుగా, మంసరంగా గదిలో తిరుగుతుంది. లలిత కుడిచెయ్యి, నా ఎడం చెయ్యి బాబు వీపుమీద లయగా జోకొడుతున్నాయి. వాడుమగతగా ఊ .... ఊ అంటు నిద్రలో మునుగుతున్నాడు. రెండు మూడు నిమిషాలు బాబు మూలుగు, లలిత గాజుల చప్పుడు తప్ప మరింకేమి వినబడలేదు.

"ఓ మాటడగనా?" నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ అంది.

"ఊ."

"నావైపు చూసి చెప్పండి." తలెత్తి లలిత ముఖంలోకి చూశాను.

"యింతకూ, ఎవరా స్వప్న సుందరి?"

నేను అర్థంగాక అనుమానంగా చూస్తుంటే మళ్ళీ ఆమె అంది. "అదే, మీ వర్షంలో వనిత."

"అదిగో. మళ్ళీ అదే ధోరణి. అందుకే నన్నర్థం చేసుకో లేదంటాను."

బాబు వీపుమీద లయగా పైకి క్రిందికి లేచి పడుతున్న నా చేయి ఆగింది.

లలిత నా కళ్ళలోకి న్యాయనిర్ణేతలా దోషాన్ని గాలమేసి పడుతున్నట్టు చూసుంది,

"ఏమీ లేంది భుజాలు తడుముకోవటం దేనికి? అయినా. ప్రతి ఊహా సుందరికి ఓ మూల విరాట్రూపం ఉండాలిగా?"

"నువ్వే" అది అబద్ధమని నాకు తెలుసు.

లలిత నవ్వింది. నా మనసు తేలికపడింది.

"యింత చక్కని రంభ యింటిలో ఉండగా యితరులతో పనిఏమి జోజో" మళ్ళీ యిరువురి చేతులు బాబు వీపుమీద లయగా ఆడుతున్నాయి. ★

